ప్రజాశక్తి
సోమవారం 16 జూన్ 2025 | 5 | అనంతపురం

బుక్‌లెట్ విడుదల చేస్తున్న నాయకులు

మేమేమి పాపం చేశాం...

చాలీచాలని వేతనంతో వెట్టిచాకిరీ....
తల్లికి వందనమేకాదు...సంక్షేమ పథకాలన్నీ ఇవ్వాలి ..
అంగన్‌వాడీల విన్నపం
23న కలెక్టరేట్ ఎదుట ధర్నా

మేమేమి పాపంచేశాం... చాలీచాలని వేతనంతో వెట్టిచాకిరీ చేస్తున్నా ప్రభుత్వాలు గుర్తించవా... అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణే కాదు ప్రభుత్వ కార్యక్రమాల్లోను భాగస్వాములుగా బాధ్యతలు పెడుతున్నారు. తల్లికి వందనమేకాదు...ప్రభుత్వం అర్హులకు అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను మాకు వర్తింపచేయాలి. దిన కూలీలతో సమానమైన కనీసవేతనం కూడా మాకు లేనప్పుడు సంక్షేమ పథకాలకు ఎందుకు అనర్హులవుతాం.? ఇవీ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తల మనస్సులోని ఆవేదన. అంగన్వాడీల విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 23వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం టౌన్

అంగన్‌వాడీల ఆవేదన...

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల ఆవేదన అంతాఇంతా కాదు. వారు నిత్యం తమ వృత్తిలో చేస్తున్న వెట్టిచాకిరి తలచుకుంటూ వేదనకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 23 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. ఇందులో మెయిన్, మిని అంగన్‌వాడీ కార్యకర్తలు 5126 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరేకాదు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలలో 4286 మంది హెల్పర్లు కూడా విధులు నిర్వహిస్తున్నారు. వీటిలో ఒకటి అర ఎక్కడైనా ఖాళీ ఉండొచ్చేమేకాని సరాసరి ఈ సంఖ్యలో అంగన్‌వాడీలు, హెల్పర్లు వున్నారు.

అంగన్‌వాడీలు 40 శాతం...హెల్పర్లు 50 శాతం పథకాలు పొందే అవకాశం సంక్షేమ పథకాలు కార్యకర్తలు, హెల్పర్లకు వర్తింపచేస్తే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 23 ప్రాజెక్టులలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న 5126మంది కార్యకర్తల్లో 40 శాతం మంది, హెల్పర్లు 50 శాతం మంది అర్హతపొందే అవకాశముంటుంది. ఉద్యోగవిరమణ వయస్సుకు 8ఏళ్లకు దగ్గరలో వున్నవారి పిల్లలు దాదాపు ఇంటర్మీడియట్ చదువులు పూర్తిచేసుకుని వుంటారు. ఈ లెక్కన అంగన్‌వాడీ కార్యకర్తలు సుమారు 2వేల మంది, హెల్పర్లు మరో 2వేల మంది తల్లికి వందనం అందుకునే అవకాశముంటుంది. ఈ లెక్కన ఆయా కుటుంబాలలో సరాసరి విద్యార్థుల సంఖ్యను కూడా ఒక్కో కుటుంబంలో ఇద్దరు ప్రకారం లెక్కగడితే నాలుగువేల మంది పిల్లలకు తల్లికి వందనం వర్తించే అవకాశముంది. ఇది కాకుండా ఇతరులకు అందుతున్న అన్ని సంక్షేమ పథకాల తరహాలోనే 5126 మంది కార్యకర్తలు, 4286 మంది హెల్పర్లు అందుకునే అవకాశముంటుంది.

అర్హతకు ఆదాయ నిబంధనలు...అంగన్‌వాడీల వేతనాలు పరిశీలిస్తే....సంక్షేమ పథకాల అర్హతకు ప్రభుత్వం విధించిన నిబంధనలు చూస్తే పట్టణ ప్రాంతాల్లో నెలకు ఆదాయం రూ.12వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేలకు మించి వుండకూడదు. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు మించకూడదు, పక్కాగృహం వెయ్యి చదరపు అడుగులు మాత్రమే వుండాలి. నిబంధనలు ఆధారంగా అంగన్‌వాడీ వేతనాలు పరిశీలిస్తే మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తకు నెలకు రూ.11,500, మిని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు రూ.7వేలు చొప్పున వేతనం అందుకుంటున్నారు. ఇలాంటి చాలిచాలని వేతనాన్ని అందుకుంటున్న వీరిని ప్రభుత్వ అర్హులుగా ఎందుకు గుర్తించడంలేదనేది ఆయా చిరుద్యోగుల ఆవేదన. దినసరి కూలి కూడా రోజుకు రూ.300ల ప్రకారం నెలకు రూ.9వేలకు పైగానే సంపాదించి మధ్యాహ్నానికి ఇంటికి చేరుకుంటారు.

ఈనెల 23న కలెక్టరేట్ వద్ద ధర్నా... అంగన్‌వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఆయా యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నాకు నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా వున్న కార్యకర్తలు, హెల్పర్లు హాజరై వారి ఆవేదనను కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు.

ప్రాజెక్టుల సంఖ్య : 23	మెయిన్ కేంద్రాలు : 4286	కార్యకర్తలు : 4286	మొత్తం సంఖ్య : 5126
	మినీ కేంద్రాలు : 840	కార్యకర్తలు : 840	ఆయాల మొత్తం సంఖ్య : 4286

సంక్షేమ పథకాల జీవో ఇవ్వాలి

అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం జీవో విడుదల చేయాలి. గత ప్రభుత్వంలోను హామీ ఇచ్చి న్యాయం జరగలేదు. తక్కువ వేతనంతో పిల్లలను చదివించుకోవడం భారంగా వుంది. ఒంటరి మహిళా పింఛన్, వితంతు పింఛన్లు వర్తించాలి. ఒకే ఉద్యోగికి రెండు నిబంధనలు అన్యాయం. పనికి తగ్గ వేతనం వుంటే అన్ని భరిస్తాం.

శకుంతలమ్మ,
అంగన్వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

శ్రమను గుర్తెరిగి పథకాలు ఇవ్వాలి

వర్కర్లు, హెల్పర్ల శ్రమను గుర్తెరిగి వేతనాలను పరిశీలించి ప్రభుత్వం సంక్షేమ పథకాలివ్వాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లోను భాగస్వాములుగా పని చేస్తున్నాం. వేతనం లోను న్యాయం లేదు. సంక్షేమపథకాలు ఇవ్వడంలేదు. ఇంత కన్నా అన్యాయం ఏముంది. పాలకులు మాశ్రమను గుర్తించి పథకాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

రమాదేవి,
అంగన్వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కార్పొరేట్లకు వరాలు.. పేదలకు శాపాలు

♦ సూపర్ సిక్స్ హామీలకే పరిమితం.. అమలులో జాప్యం
♦ 'దారి తప్పుతున్న టిడిపి కూటమి ఏడాది పాలన' బుక్‌లెట్ ఆవిష్కరణలో
సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో కార్పొరేట్ సంస్థలకు వరాలు కురిపిస్తూ పేదలకు హామీలతోనే సరిపెడుతూ సంక్షేమాభివృద్ధిని విస్మరిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప విమర్శించారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై జూన్ 12వ తేదీతో ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఏడాదిలో కొనసాగించిన పాలన విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రూపొందించిన 'దారి తప్పుతున్న టిడిపి కూటమి ఏడాది పాలన' పేరుతో రూపొందించిన బుక్‌లెట్‌ను సిపిఎం నేతలు ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, ఎం. బాల రంగయ్య, వి.రామిరెడ్డి, ఎం.క్రిష్ణమూర్తి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటి సభ్యులు ఓతూరు పరమేష్‌లతో కలిసి సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఓ. నల్లప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సర కాలమంతా ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ అమలులో నత్తనడక పాలనలా సాగుతోందని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీల వేలాది ఎకరాల భూములు ఇస్తూ పేదలకు ఇంటి స్థలం ఇవ్వడానికి 30 జీవో అమలు చేయడం లేదనిమండిపడ్డారు. మతోన్మాదాన్ని పెంచే విధంగా పాలన నడుస్తోందన్నారు. సూపర్ సిక్స్‌లో నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఊసే లేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ప్రస్తావనే లేదన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలన్నారని కేవలం మెగా డిఎస్సీ 16,400 పోస్టులు మాత్రం ప్రకటించి పరీక్షలు పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇంత వరకు ఒక్క ఉద్యోగం ఎక్కడ ఇవ్వలేదన్నారు. రైతులకు పెట్టుబడి సాయం, అన్నదాత సుఖీభవ రూ.20 వేలు ఊసే లేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం ప్రత్యేక నిధి అమలైన పరిస్థితి లేదన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 సంవత్సరానికి రూ.18 వేలు, 19 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు ఉన్న మహిళకు ఇస్తామని ఇచ్చిన హామీ అమలు ఊసే లేదన్నారు. ఈ ఏడాది వీరికి రూ.32,400 కోట్ల ఎగ్గొట్టారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్నారు. తల్లికి వందనం పేరుతో రూ.10 వేల కోట్లు ఇచ్చామంటూ గొప్పలు చెబుతున్నారని, ఇదే ఏడాది చూస్తే విద్యుత్ ఛార్జీల భారం రూ.15500 కోట్లు ప్రజల నెత్తిన భారాన్ని మోపారని విమర్శించారు. జిల్లాలో హెచ్ఎల్‌సి ఆధునీకరణ పనులు చేపట్టలేదని, హంద్రీనీవా పిల్ల కాలువలు తవ్వకుండా లైనింగ్ పనులు చేస్తున్నారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.రామిరెడ్డి మాట్లాడుతూ టిడ్కో, జగనన్న ఇళ్ల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారని తిరిగి వాళ్లకి ఇళ్లను కట్టబెట్టకుండా అన్యాయం చేశారని అన్నారు. ఎం.బాల రంగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు కౌలు రైతులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. 319 జీవో ప్రకారం దేవాలయ భూములను 33 సంవత్సరాలకు లీజుకు ఇవ్వడం ద్వారా కౌలు రైతులకు తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మిర్చికి రూ.11700 గిట్టుబాటు ధర లేకపోతే ధర పెంచి కొనుగోలు చేస్తామన్న హామీ అమలు చేయలేదన్నారు. సోలార్ పేరుతో జిల్లాలో లక్షలాది ఎకరాలు భూమి సేకరించి రైతులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను సవరించి ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచడం, మహిళలను రాత్రి డ్యూటీలు చేయించుకోవచ్చని సవరించడం దుర్మార్గం అన్నారు. స్కీం వర్కర్స్, కాంట్రాక్ట్ కార్మికులందరికి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజుల పని, బిల్లులు చెల్లించాలని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ప్రజలందరూ కలిసి ఉద్యమాలు చేసి సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

17న ఎడారీకరణ నివారణ దినోత్సవం

ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవి.మల్లారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 17వ తేదీన ప్రపంచ ఏడారీకరణ నివారణ దినోత్సవం పురస్కరించుకుని ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టరు వైవి.మల్లారెడ్డి తెలిపారు. అనంతపురం నగరంలోని ఎఎఫ్ ఎకాలజీ కేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునీకరణ పేరుతో విచ్చలవిడిగా ప్రకృతి సంపదను కొల్లగొడుతుండటం మూలంగా కరువులు, ఏడారీకరణ, వాతావరణ మార్పులు పెద్దఎత్తున సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రకృతిని కాపాడుకునే విధంగా జీవన విధానంలో మార్పులు రావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మనిషి ప్రకృతికి యజమాని కాదని, ధర్మకర్త మాత్రమేనని తెలిపారు. కావున దీన్ని సక్రమంగా వినియోగించుకునే విధంగా వ్యవసాయ విధానంలోనూ మార్పులు తీసుకురావాల్సిన అవసరముందన్నారు. రసాయన పద్ధతులను విడనాడి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సి ఉందన్నారు. ఈ విధానంపై గడిచిన నాలుగు దశాబ్దాలుగా ఎఎఫ్ ఎకాలజీ పనిచేస్తోందని గుర్తు చేశారు. సహజ పద్ధతుల్లో వ్యయసాయం చేపట్టడం ద్వారా ప్రకృతిని కాపాడగలమని వివరించారు. జిల్లాలో ఎఎఫ్ ఎకాలజీ ఈ పద్ధతులను రైతులకు అలవరించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ విధానాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లడంలో భాగంగానే ఈనెల 17వ తేదీన ఏడారీకరణ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించాలని తలపెట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఈ పద్ధతుల్లో చేపడుతున్న వ్యవసాయ విధానలకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎఎఫ్ ఎకాలజీ సిఒఒ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన అనంతపురం నగరంలోని పంగల్ రోడ్డులోనున్న విభిన్న ప్రతిభావంతుల ఆర్డీటీ హైస్కూల్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ హాజరవుతారని చెప్పారు. కావున ఈ కార్యక్రమంలో రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మీడియా కో ఆర్డినేటరు ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

104 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. అనంతపురం సిఐటియు జిల్లా కార్యాలయంలో 104 సర్వీస్ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు శివకృష్ణ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్, యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏజీ రాజమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్వీ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ 104 ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఏ లక్ష్యంతో అయితే పాలకవర్గాలు 104 సర్వీసును ప్రారంభించాయో ఆ లక్ష్యం పట్ల ఉదాసీన వైఖరిని పాలకవర్గాలు అనుసరిస్తున్నాయన్నారు. అరబిందో యాజమాన్యం కాలపరిమితి ముగిసిందనిఈ సంస్థ రెండు నెలలు బకాయి వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు . ప్రస్తుతం 104 సర్వీస్‌ల నిర్వహణ చూస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా అదే ధోరణి అవలంభించడంతో ఉద్యోగులకు ప్రతీ నెల వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి వేకెన్సీ స్థానాల్లో కొత్త నియామకాలు జరపాలని డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాలనుండి మరమ్మతులకు నోచుకోని వాహనాలను వెంటనే మరమ్మతులు చేయించాఅన్నారు. ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతీ నెల జిల్లాలో గ్రీవెన్స్ ఏర్పాటుచేసి తక్షణ సమస్యలు పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలని కోరారు. 104 వాహనాల్లో క్షయ పరీక్షలకు సంబదించిన నమూనాలు రవాణా మంచిది కాదని వాహనాల్లో గర్భిణుల పరీక్షలు చేస్తున్నారని అన్నారు. ఆరోగ్య కేంద్రాలు లేని చోట సిబ్బంది కూడా వాహనాల్లో సేవలు కొనసాగిస్తున్నారని ఇది చాలా ప్రమాదకరమని చెప్పారు. ప్రభుత్వం పునరాలోచించికోని అలాంటి పరీక్షలకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించి చేయించాలని కోరారు. ఎ.పి 104 ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో 104 సంఘం జిల్లా కార్యదర్శి యస్.సుబ్రమణ్యం, సహ ఉద్యోగులు డికె మల్లిఖార్జున్, ఓబెల్స్ మానస, మహమ్మద్ పీరా, షబానా బాను, రుద్ర , రాఘవ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్రకుమార్

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

శ్రీ సత్య సాయి జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఇ సంపత్ కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో గృహాలకు, రైతులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందజేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో జిల్లా ఎస్ఇ సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో విద్యుత్ సరఫరాకు సంబందించి పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : రైతులకు 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్తును అందజేస్తున్నారా?

జవాబు: ప్రస్తుతం రైతులకు వ్యవసాయ పంపుసెట్లకు పగటి పూట రెండు దపాలుగా విద్యుత్ సరఫరాను చేస్తున్నాం. రైతులకు విద్యుత్ అందించడంలో నూతన పద్ధతులను ద్వారా అంతరాయం లేకుండా లోవోల్టేజ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ విద్యుత్తును అందిస్తున్నాము.

ప్ర : జిల్లావ్యాప్తంగా నూతనంగా ఎన్నిఎన్ని సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న సబ్ స్టేషన్లో తో పాటు కొన్నిచోట్ల లో వోల్టేజ్ సమస్య కారణంగా కొత్త సబ్ స్టేషన్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

అవి నిర్మాణ దశలో ఉన్నాయి. కొన్నింటిని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసాం. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఇందులో భాగంగా పుట్టపర్తి మండల పరిధిలోని నిడిమామిడి ,వెంగళమ్మ చెరువు, పుట్టపర్తి వెస్టిగేట్ సమీపంలో ఏర్పాటు చేస్తున్నాం. వీటి పనులు త్వరలో ముగియనున్నాయి. అవి అందుబాటులోకి వస్తే పుట్టపర్తి మండలంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం ఉండదు.

ప్ర : జిల్లా వ్యాప్తంగా రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి? రైతులకు నూతన కనెక్షన్లు మంజూరు చేయలేదా?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా బోరుబావుల కింద రైతులకు 1. 53 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గత కొంతకాలం నుండి నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్లు అందించలేదని పలువు రైతులు ఆందోళన చెందుతున్న విషయం వాస్తవమే. దానికి సంబంధించిన విద్యుత్ పరికరాలు సకాలంలో అందకపోవడంతో రైతులకు అందించలేకపోయాం. ఇటీవల దరఖాస్తు చేసుకున్న రైతులకు జూన్ ఆఖరుకు నూతన విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు అందజేసి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందజేస్తాం.

ప్ర : పట్టణ ప్రాంతాల్లో వేళా పాలలేని విద్యుత్ కోతలపై మీ సమాధానం?

జ: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వర్షం, ఉరుములు ,మెరుపులు, వచ్చినప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, గాలులకు కొన్నిచోట్ల విద్యుత్తు లైన్లు విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, వైర్లు పెనవేసుకోవడం తో ఆ సబ్ స్టేషన్ పరిధిలో అంతరాయం ఏర్పడుతుంది. వాటిని సంబంధిత లైన్‌మెన్లు గ్రహించి పునరుద్ధరణ చేసేందుకు సమయం పడుతుంది. దాని ద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. నూతన టెక్నాలజీ కారణంగా జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు అన్ని సబ్ స్టేషన్లలోనూ విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ట్రాన్స్‌కో ఎస్ఇ సంపత్‌కుమార్

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టాలి

సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబులు

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని నిదనవాడ గ్రామం సమీపంలో ఉన్న పెన్నానది పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టాలని సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని నిదనవాడ గ్రామం వద్ద పెన్నానదిలో ఇసుక తవ్వకాలను అఖిలపక్ష నాయకులు పరిశీలించారు. ఇందులో భాగంగా ఇసుక తవ్వకాల వల్ల సాగు, తాగునీరు లేకుండా పోతోందని నిదనవాడ, చిత్రచేడు, గోపురాజుపల్లి, రాచేపల్లి గ్రామాల రైతులు అఖిలపక్షం నాయకుల ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్నానదిలో నెల రోజుల నుంచి దాదాపు 20 అడుగుల లోతు వరకూ తవ్వినా పట్టించుకునే వారే లేకపోవడం బాధాకరమన్నారు. రాత్రింబవళ్లు ఇసుక తవ్వుతున్నా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, వైసిపి నాయకులు విశ్వనాథరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఓబిరెడ్డి, రైతుసంఘం నాయకులు రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులను చేర్చొద్దు

ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అక్షరాలతో వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్చొద్దని ఎస్ఎఫ్ఐ నేతలు విజ్ఞప్తి చేశారు. ఆదివారం గణేనాయక్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ కరువు కాటకాలకు నిలయమైన అనంతపురం జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థల మాఫియాతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యా సంస్థలు మొత్తం విద్యా వ్యవస్థను తమ స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి విద్య మాఫియాగా ఏర్పడిందన్నారు. ఫీజులు కాకుండా పాఠ్యపుస్తకాల పేరుతో ఒక్కొక్క విద్యార్థి దగ్గర నుంచి రూ.10 నుంచి రూ.22 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. స్కూల్ యూనిఫామ్‌లు బూట్ల పేరుతో వేల రూపాయలు తల్లి దండ్రుల నుంచి ముక్కు పిండి వసూలు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేస్తున్నారని తెలిపారు. ర్యాంకుల పేర్లు చూపించి డబ్బులు దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. వీటి మాయ నుంచి పడి తల్లిదండ్రులు బయటపడాలన్నారు. ఆయా విషయాలను పూర్తిగా గమనించి కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల్లో పిల్లలను చేర్పించి శవాలుగా మీ ఇళ్లకు తీసుకెళ్లవద్దని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వైటిసి రమేష్, బంగి శివ, తరిమెల గిరి, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్న విద్యాశాఖ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గతంలో కూడా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేకమార్లు విద్యాశాఖ అధికారి సమక్షంలోనే అనేక ప్రయివేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని అనేకమార్లు పోరాటాలు చేశామన్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా జిల్లా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టినట్లుగా వ్యవహరించారని ఆరోపించారు. రాయదుర్గంలోని ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు చేస్తున్న మోసాలపై అనేక పత్రికల్లో కథనాలు సైతం వచ్చినప్పటికీ జిల్లా అధికారులు మాత్రం పట్టి పట్టినట్లుగా వివరించడం బాధాకరమన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఇచ్చే మామూళ్ల మత్తులో విద్యాశాఖ అధికారులు మునిగి పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఆయా పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

మరోసారి ప్రహరీ కూల్చివేత

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రం లోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానం ప్రహరీని మరోసారి కూలగొట్టారు. గతంలో పాఠశాల ప్రహరీని కొందరు దుండగులు పడగొట్టడంతో స్థానిక వాకర్లు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనికితోడు వాకర్లు చందాలు వేసుకుని పోలీసుల సమక్షంలో ప్రహరీని నిర్మించారు. అప్పట్లో మరోసారి ప్రహరీని కూలిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పోలీసుల హెచ్చరికను సైతం బేఖతార్ చేస్తూ కొందరు దండగులు కళాశాల ప్రహరీని కూల్చారు. గోడను ఎవరు కూలగొట్టారో కచ్చితంగా పరిసర ప్రాంత ప్రజలకు తెలిసి ఉంటుందని, పోలీసులు విచారణ చేసి ప్రహరీని పడగొట్టిన వారిపై కేసు

కూలిన ప్రహరీ

నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వాకర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రహరీ చుట్టూ మొక్కలు నాటుదాం..

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానం ప్రహరీ చుట్టూ మొక్కలను నాటి పరిరక్షిద్దామని టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక క్రీడా మైదానంలో ఉన్న చెత్తాచెదారాన్ని జెసిబితో తొలగించారు. క్రీడామైదానం దుస్థితిపై వెంటనే స్పందించి ప్రత్యేక చొరవ తీసుకుని క్రీడా మైదానాన్ని పరిశుభ్రం చేయడంతోపాటు ప్రహరీ చుట్టూ మొక్కలు నాటిస్తున్న ఆలం వెంకట నరసానాయుడుకు వాకర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జగన్, భారతి బహిరంగ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అమరావతి ప్రాంతం మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కారణమైన వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి, భారతిరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని టిడిపి మహిళా నాయకురాళ్లు డిమాండ్ చేశారు. అమరావతి మహిళలపై చేసిన వాఖ్యలను ఖండిస్తూ టిడిపి మహిళా విభాగం, తెలుగుయువత, టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా రాష్ట్ర నాయకురాలు స్వప్న, తేజశ్విణి, పరమేశ్వరి, టిఎన్ఎస్ఎఫ్ లక్ష్మినరసింహులు, లీగల్ సెల్ ఆదెన్న, సుదాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కార వేదిక' ఏర్పాట్లు పరిశీలన

యాడికి : ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించిన ఏర్పాట్లను తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా స్థానిక బుగ్గ రోడ్డు టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాట్లను పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమ నాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, RAYADURG
O.S No:134/2023

Between:
A.V. Prathap ...Plaintiff.
&
B.Hanumantha Reddy ...Defendant.

NOTICE

To
B. Hanumantha Reddy, S/o. Late B. Bheemanna, R/o. Mylapuram, H/o. Kolaganahalli Village, Bommanahal Mandal, Anantapuramu Dist.,
Please take notice that the above named plaintiff had filed the above suit against you for recovery of suit claim and the same is posted to 30.06.2025 for your appearance. So you are hereby directed to appear before the above Court at 10-30 A.M. on 30.06.2025 either in person or through the Counsel without fail, with all documentary evidence on which you propose to defend the matter. If you fails to appear on that day you will be set ex parte and the matter will be determined ex parte.

(By Order of the Court)

SRI C. NAGARAJU
Smt. B. MAMATHA
Advocates, Rayadurg.

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SR. DIVISION): GOOTY
S.O.P.No: 1/2025

Between:
Buchappagari Chinna Sunkanna,,S/o B.Kesanna, R/o D.No.1-64, BC Colony, Pathakothacheruvu village, Guntakal Mandal. ...Petitioner
And
Sree Andhra Pragathi Grameena Bank,Rep by its Branch Manager,Pamidi Branch, Pamidi ...Respondent

ప్రకటన

పై నెంబరు కేసులో ఎల్లూరు కేశమ్మ చనిపోయి నందు వలన ఆమెకు Sree Andhra Pragathi Grameena Bank Pamidi Branch నందు రావలసిన మొత్తమును తీసుకొనుటకు పై కోర్టులో అర్జీదారుడు వారసత్వపు సర్టిఫికెట్ కొరకు అర్జీ దాఖలు చేసియున్నారు. సదరి కేసు 17-06-2025వ తేదిన ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు అర్జీదారుని తరుపున కోర్టువారు తీర్మానించెదరు అని తెల్పడమైనది.

Schedule

An amount of Rs.72,619.05 Ps (Rupees seventy two thousand, six hundred, nineteen and paid five only) payable by the respondent to the petitioner lying in the SB Account bearing No.19070044718 of Late Kesamma on her consequent death.

(By Order of the Court)

T.Dhanunjaya, Advocate,
GootyCell No 98858 96307

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

పామిడి : స్థానిక భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో లయన్స్ క్లబ్ పామిడి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనంతపురం, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు కంటి వైద్య నిపుణురాలు క్రతిక గుప్తా, తదితరులు కంటి సంరక్షణ, జాగ్రత్తలు, నివారణ చర్యలపై వివరించారు. ఇందులో భాగంగా 280 మందిని పరీక్షించి 117 మందిని శస్త్ర చికిత్సకు సిఫారసు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్ అన్నదానం ఏర్పాపు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి షేక్షావలి, జిల్లా ఛైర్మన్ డాక్టర్ మురళీ, మెంబర్‌షిప్ ఛైర్‌పర్సన్ డాక్టర్ శాంతి ప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రోషన్ జమీర్, డైరెక్టర్స్ గంగ శేఖర్, సుహేన్, ముండే షేక్షావలి, ప్రసాద్, పత్రా నరేష్ కుమార్, పత్రా రాకేష్, ప్రభాకర్, సురేష్, శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివప్రకాష్, శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది, లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'కూటమి' వైఫల్యాలను ఎండగడదాం

'జగన్ అంటే నమ్మకం' పుస్తకావిష్కరణలో అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడదామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై ప్రచురించిన 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా చంద్రబాబు చేస్తున్న మోసాలు, అరాచకాలను వివరిస్తూ పుస్తకాన్ని ఆవిష్కరించామన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు మేనిఫెస్టోను పక్కాగా అమలు చేశామని గుర్తు చేశారు. మధ్యవర్తులు, అవినీతికి ఆస్కారం ఇవ్వకుండా ఐదేళ్లలో ఏకంగా రూ.2.81 లక్షల కోట్లు లబ్ధి చేకూర్చామన్నారు. చంద్రబాబు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైతే ప్రజలను మోసం చేశారో.. ఇప్పుడు కూడా మోసం చేస్తూనే ఉన్నారన్నారు. సమస్యలను ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తితే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చారు. కేవలం సూపర్ సిక్స్ పథకాల కోసం ఏటా రూ.81 వేల కోట్లు వెచ్చించాల్సి ఉందన్నారు. ఏడాదిగా ఒక్క సూపర్ సిక్స్ హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. మేం అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాపక్షంగానే ఉంటామన్నారు. తమ పోరాటం కారణంగానే ఏడాది తర్వాత తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారన్నారు. అది కూడా 67 లక్షల మందికి అని చెబుతున్నా వాస్తవానికి 37.70 లక్షల మందికే ఇచ్చారని మండిపడ్డారు.

అనంతపురంలో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

రాయదుర్గం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్వగృహంలో 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కుల మతాల బేధం లేకుండా, పార్టీలకతీతంగా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతి భద్రతలు నశించి మహిళలపై దౌర్జన్యాలు, అకృత్యాలు మితిమీరి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరాళు శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు మారన్న, జిల్లా కోశాధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్లు కనేకల్, హీరేహాల్, రాయదుర్గం రూరల్ గుడిసెల రవీంద్రనాథ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామాంజనేయులు, బీసీ సంఘం ఉపాధ్యక్షులు నాగరాజు, నిజాముద్దీన్, బసవరాజు, మారన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఆర్డీటీని కాపాడుకుందాం

మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పార్టీలకు అతీతంగా ముందుకు వచ్చి రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ)ని కాపాడుకుందామని మాజీమంత్రి ఎన్.రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. సేవ్ ఆర్డీటీ పేరుతో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్ర ఆదివారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం మండలం బాల వెంకటాపురంలో పాదయాత్రకు ఎన్.రఘువీరారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నర లక్షల కుటుంబాలకు 50 ఏళ్ల నుంచి ఆర్డీటీ సంస్థ సేవలు అందిస్తోందన్నారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం మంచిది కాదన్నారు. మాజీ ఎంపి తలారి రంగయ్య ఆర్డీటీ కోసం పాదయాత్ర చేపట్టడం హర్షనీయమన్నారు. ఈ పాదయాత్ర అందరికీ ప్రేరణ అన్నారు. తాను కూడా త్వరలోనే ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంమంత్రిని కలిసి



మహిళలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి

విన్నవించేందుకు యత్నిస్తానన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్ధరించాలని కోరారు. పాదయాత్రలకు ఆయనతోపాటు మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, యువరాజ్యం అలెక్స్ సంఘీభావం తెలిపారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

పేదలకు ఆర్థిక చేయూత

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పేదలు, మధ్య తరగతి వర్గాల వైద్యసేవలకు ఆర్థిక చేయూతనిస్తూ ఆదుకుంటున్న మనసున్న వ్యక్తి సిఎం చంద్రబాబు అని విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో 46 మందికి మంజూరైన సిఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన రూ.24లక్షల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి తానున్నాన్నంటూ సిఎం చంద్రబాబు స్పందిస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజానీకం చేసుకొన్న గొప్ప అదృష్టమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అనేకమంది అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్న అలాంటి వారికి ప్రభుత్వం తరపున ఉడతాభక్తిగా ఆర్థిక చేయూత అందించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 2014-19 మధ్య వందలాది మందికి సిఎంఆర్ఎఫ్ కింద దాదాపు రూ.కోటి పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్లు బలరామిరెడ్డి, లాలెప్ప, హనుమంతు, ఆర్యవైశ్య, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు నాగల్లీ రాజు, పురుషోత్తం, మాజీ చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ టి.హనుమంతు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్‌రెడ్డి, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో 'గ్లోబల్' ప్రభంజనం

ప్రజాశక్తి-అనంతపురం

నీట్-2025 ఆలిండియా ఫలితాల్లో గ్లోబల్ కళాశాలకు చెందిన గ్రామీణ ప్రాంత విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సత్తాచాటారు. కళాశాలకు చెందిన లిఖిత 4596 ర్యాంకు, ముస్కాన్ 15023, మరోపల్లి కీర్తన 25842, తుమ్మల ముంతాజ్ మహమ్మద్ 51790, కుందూరి క్షమిత 94613 ర్యాంకులను సాధించి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డైరెక్టర్లు ప్రతాప్‌రెడ్డి, బాషా, మహేష్, డీన్ ఆంజనేయులు, ప్రిన్సిపల్ నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా డీన్ ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఎంతో విశ్వాసంతో గ్లోబల్ విద్యాసంస్థల్లో వారి పిల్లలను చేర్పించి తమపై నమ్మకం ఉంచాలని తెలిపారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా అద్భుతమైన ఫలితాలు సాధించి ప్రారంభించిన రెండవ సంవత్సరంలోనే అద్భుతమైన ఫలితాలను సాధించారని తెలిపారు.

నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు

గుత్తివాసి ఉత్తమ ర్యాంకు

గుత్తి : నీట్ పరీక్షల్లో గుత్తికి చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభను చాటాడు. ఎపి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుని జె.అరుణకుమారి, రమేష్‌రెడ్డి కుమారుడు లక్కిరెడ్డి నిశాల్ రెడ్డి నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను చాటాడు. 539 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 17965 ర్యాంకు సాధించాడు. దీంతో తోటి విద్యార్థులు, స్నేహితులు, బంధువులు ఆ విద్యార్థిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత యుపిఎస్‌సి స్కాలరిషిప్ టెస్టు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సాయినగర్ 6వక్రాస్‌లోని లాస్య స్టడీ సెంటర్‌లో ఆదివారం అరోరా ఐఎఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత యుపిఎస్‌సి స్కాలరిషిప్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా అరోరా సంస్థ డైరెక్టర్ గిరి కాకర్ల మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో మొట్టమొదటగా అరోరా ఐఎఎస్ అకాడమీ ఆధ్వర్యంలో స్కాలరిషిప్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టెస్టుకు 45 మంది అభ్యర్థులు లాస్య అకాడమీ వేదికగా హాజరైనట్లు తెలిపారు. గత నాలుగేళ్లుగా అరోరా సంస్థ ఎంతోమంది యుపిఎస్‌సి ద్వారా గ్రూప్ వన్ గ్రూప్ టు ఆఫీసర్లుగా తీర్చిదిద్దని తెలిపారు. ప్రస్తుతం 2025 - 26 గ్రూప్స్ నిమిత్తం నిర్వహిస్తున్న స్కాలర్షిప్ టెస్టుకు రాష్ట్రంలోనూ అనూహ్యమైన స్పందన లభిస్తుందని తెలిపారు. జిల్లాలో నిర్వహించిన స్క్రీనింగ్ లో 45 మందిలో పదిమందికి పూర్తిస్థాయి యూపీఎస్సీ శిక్షణను అందిస్తామని చెప్పారు. వీరు ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ శిక్షణకు హాజరుకావచ్చున్నారు. తర్వాత స్థానంలో 15 మందికి 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు స్క్రీనింగ్ టెస్ట్‌లో పాల్గొన్న అందరికీ ఎస్సీఈఆర్టీ కోచింగ్ ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. తమ సంస్థలో 2019లో చదివిన స్వాతి గ్రూప్స్‌ల ఆరో ర్యాంకు సాధించి మచిలీ పట్నం డిప్యూటీ కలెక్టర్‌గా ఇదేక్రమంలో గ్రూప్2లో కర్నూలుకు చెందిన మానస ట్రెజరీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రూప్-1, గ్రూప్-2 ఆఫీసర్లుగా ఎంతోమందిని తయారు చేయడంలో అరోరా అకాడమీ ముందుంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 93462 65766 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లాస్య స్టడీ సెంటర్ ఫౌండర్ రాధిక, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యుపిఎస్‌సి స్కాలర్‌షిప్ టెస్టు రాస్తున్న విద్యార్థులు

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి-అనంతపురం

యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాల ఐక్యూఎసి కోఆర్డినేటర్ ఎ.శ్రీనాథ్ సూచించారు. ఆదివారం కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి ఆదేశాలతో అధ్యాపకులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో యోగా భాగం కావాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ధ్యానం, యోగా చేయాలన్నారు. తద్వారా మంచి ఆరోగ్యంతో పాటు ఒత్తిడి తగ్గించుకోవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా చేయాలన్నారు. రోజూ గంటపాటు యోగా చేయడం ద్వారా సంతోషకరమైన జీవితానికి బాటలు వేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ అధ్యాపకులు ఎం.శ్రీనివాసులునాయక్, జాతీయ సేవా పథకం అధికారి జి.ఆనంద్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కళ్యాణదుర్గం రూరల్ : గొంతు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న శెట్టూరు మండలం కైరేవు గ్రామానికి చెందిన హరిజన వన్నూరుస్వామికి ఇన్ఫినిటీ ట్రస్టు వ్యవస్థాపకులు బద్దేనాయక్ ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. వన్నూరుస్వామి అనంతపురం ప్రభుత్వ ఆసుప్రతిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బద్దేనాయక్ అనంతపురం వెళ్లి ఆర్థికసాయం అందించారు. ఇదే ఆసుపత్రిలో కైరేవు గ్రామానికి చెందిన ఓబుళమ్మను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. పాళ్లూరు వెంకటాంపల్లి గ్రామానికి చెందిన వన్నూరుప్ప కుడి కాలుకు ఆపరేషన్ జరిగింది. దీంతో ఆయనున్న పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సాయినాథ్, మహాలింగ పాల్గొన్నారు.

శ్రీశ్రీ ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) ఆశయాలను కొనసాగిద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని శ్రీశ్రీ నగర్‌లో ప్రజానాట్యమండలి, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల తెలుగు ప్రొఫెసర్ అంకే శ్రీనివాసులు మాట్లాడుతూ విప్లవ కవిగా, కార్మిక కష్టజీవులు, విద్యార్థి, మహిళ ఆశాజ్యోతిగా శ్రీశ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు రచనలు నిలిచాయని తెలిపారు. చిన్నతనం నుండే కార్మికులు కష్టజీవులు పేదలు, మహిళలు విద్యార్థులు వారి సమస్యల పట్ల సమాజం అభివద్ధి వైపు రచనలు, గేయాలు రాశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కష్ణమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, డప్పు మాస్టర్ మహేష్, కళాకారులు పుల్లన్న, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, శ్రీశ్రీ నగర్ కాలనీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న నాయకులు

అంగన్‌వాడీల ధర్నా 23కు వాయిదా

అనంతపురం కలెక్టరేట్ : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిర్వహించాల్సిన ధర్నాను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసినట్లు ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జూన్ 16వ తేదీ నేడు నిర్వహించాల్సిన ధర్నా కార్యక్రమం జూన్ 23వ తేదీకి వాయిదా వేసుకున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్మికులు తెలుసుకుని 23వన చేపట్టే ధర్నాకు రావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ఉట్లమాను పరుష

బెలుగుప్ప : మండల కేంద్రంలోని వెలిసిన అవధూత ఎర్రితాత స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఉట్ల పరుష వైభవంగా సాగింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. సాయంత్రం 5 గంటలకు ఉట్లమాను పరుష నిర్వహించారు. యువకులు కేరింతల నడుమ ఉట్లమాను ఎక్కారు. ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ శివ, పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రాణించాలి : డిఆర్ఓ

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో జిల్లా విద్యార్థులు బహుమతులు సాధించాలని డిఆర్ఓ ఎ.మాలోల పిలుపునిచ్చారు. కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం అనంతపురం కలెక్టరేట్ నుంచి యోగాంధ్ర రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి విజయవాడకు వెళ్తున్న విద్యార్థుల బస్సును డిఆర్ఓ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ సెటిల్ మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, జిల్లా ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్‌రావు, తహశీల్దార్ హరికుమార్, పి.నారాయణస్వామి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆనంద్, చిన్నహోతూరు టీచర్ వెంకట్, ఆయుష్ శాఖ యోగా గురువులు కృష్ణవేణి, గురు రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని గుండిగానిపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త అజ్జప్పగారి ఈశ్వర్(45)కు మండల కన్వీనర్ పాలమండ్ల శ్రీరాములు ఆదివారం నివాళులర్పించారు. మూడు రోజుల క్రితం డీఎస్సీ పరీక్షలు రాసిన అనంతరం తిరుపతి సమీపంలో ఓ గ్రామ శివారులోని చెత్త తయారీ సంపద కేంద్రంలో ఈశ్వర్ ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశానుసారం గుండిగానిపల్లికి చేరుకున్న టిడిపి నాయకులు ఈశ్వర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళుర్పించారు. నివాళులర్పించిన వారిలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కురుగౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, నాగిరెడ్డి, పోలేపల్లి టిడిపి నాయకులు నింబజ్జ, చంద్రన్న, డీలర్ కేశవర్ధన్‌గౌడ్, ఐ టిడిపి బజ్జనగౌడ్, భీమారెడ్డి, శివన్న, మల్లన్నగౌడ్, రవీంద్ర, నరసింహులు, తదితరులు ఉన్నారు.

వైసిపి ఎస్‌టి విభాగం అధ్యక్షుడుగా లాలూనాయక్

గుత్తి : వైసిపి ఎస్‌టి విభాగం మండల అధ్యక్షుడిగా బసినేపల్లి తండా గ్రామానికి చెందిన లాలూనాయక్ నియమితులయ్యారు. వైసీపీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న లాలూనాయక్‌ను అధిష్టానం ఎస్టీ విభాగం మండల అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకం ఉంచి పదవి కేటాయించినందుకు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, గుత్తి పట్టణ, మండల అధ్యక్షులు కె.మధుసూదన్ రెడ్డి, గంగరాజుయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గడేకల్‌లో పూర్వ విద్యార్థుల రజతోత్సవ వేడుకలు

ఉరవకొండ : విడపనకల్ మండలం గడేకల్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ముందుగా గురువులను సన్మానించారు. అనంతరం గురువులు - విద్యార్థుల మధ్య జరిగిన గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుని కుటుంబ జీవిత విధానాల గురించి చర్చించుకున్నారు. చిన్నారుల ఆటపాటలతో పాటు కేరింతల నడుమ ఉత్సాహభరితంగా సాగింది.

ఫ్రీజర్ బాక్స్‌ల ఏర్పాటు

రాయదుర్గం : పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న హిందూ రుద్రభూమి ఆవరణలో ప్రజల సౌకర్యార్థం రెండు ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేసినట్లు హిందూ రుద్రభూమి అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు టంకశాల హనుమంతు, అధ్యక్షులు చుంచుల నాగప్ప తెలిపారు. ఈమేరకు ఆదివారం హిందూ శ్మశాన వాటిక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శవాన్ని తీసుకెళ్లేందుకు త్వరలో కొత్త 'వైకుంఠ రథం' వాహనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఫ్రీజర్ బాక్స్ అవసరమైన వారు అధ్యక్షులు నాగప్ప సెల్ 86395 72960, గౌరవాధ్యక్షులు హనుమంతు సెల్ 94408 22875, ఆటో డ్రైవర్ సురేష్ సెల్.. 95500 67909 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ కోశాధికారి సూరే సుందర్‌రావు, సభ్యులు పూజారి శ్రీనివాసులు, కాంబ్లీ పురందర, గుడేకోట శివకుమార్, బజారు బాబు, మాంత శ్రీనివాసులు, పోరాలు శ్రీనివాసులు, డీలక్స్ రాజు, మున్సిపల్ వార్డు సభ్యులు పోరాలు గోవిందరాజులు, ఆటో డ్రైవర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

యల్లనూరు : మండల కేంద్రంలో వెలసిన పెద్దమ్మ తల్లి (గ్రామ దేవత)కి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజారులు నూతన వస్త్రాలతోపాటు పసుపు, కుంకుమ నిమ్మకాయలహారం వేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అర్చన, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గం టౌన్ : పట్టణంలోని దొడగట్ట రోడ్డులో నివాసముంటున్న టపాల వన్నూరుస్వామి(38) శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

కుక్కల దాడి.. ఇద్దరికి గాయాలు

రాయదుర్గం : పట్టణంలోని కణేకల్లు రోడ్డులో శనిమహత్మని గుడి వద్ద ఆదివారం ఐదు కుక్కలు దాడి చేయడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చెన్న వీరమ్మ, ఈశ్వరమ్మపై కుక్కలు దాడి చేసి వారి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు బాధితులను ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని స్థానికులు కోరారు.